సాక్షి నిర్మల్

7

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024

ఊరూరా పొలాల సంబురం

భైంసాటౌన్: పొలాల అమావాస్య పండుగను జిల్లా వ్యాప్తంగా రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఎద్దులను అందంగా అలంకరించారు. రోజంతా ఉపవాసం ఉండి పూజలు చేశారు. ఆలయాలకు తీసుకెళ్లి ప్రదక్షిణ చేయించారు. భైంసా పట్టణం కిసాన్‌గల్లిలోని రోకడ్ హనుమాన్ ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఎమ్మెల్యే పి.రామారావు పటేల్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, హిందూ ఉత్సవ సమితి నాయకులు ఎద్దులకు పూజలు చేశారు. అందంగా అలంకరించిన ఎద్దులకు యువజన సంఘం ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే, ఏఎస్పీని సన్మానించారు.

- వివరాలు 9లో▸



ఎద్దులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు

గడ్డెన్నకు తగ్గిన ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం వరకు ప్రాజెక్టులోకి 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, సాయంత్రం వరకు 5,900 క్యూసెక్కులకు తగ్గింది. అధికారులు రెండు గేట్ల ద్వారా 4,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా, 357.9 మీటర్ల వద్ద స్థిరంగా ఉంచుతున్నారు.

పరిశీలించిన అదనపు కలెక్టర్

భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టును అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వరదనీటి ప్రవాహం, అవుట్‌ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దిగువకు నీటిని వదిలే క్రమంలో స్థానిక రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రాజెక్టు వద్ద సందర్శకులను అనుమతించొద్దని పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్, తహసీల్దార్ ప్రవీణ్, ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.



ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వస్తున్న నీరు

మహో వరద

- పక్కరాష్ట్రం నుంచి పోటెత్తుతున్న వరద
- జిల్లాలో కురుస్తున్న వర్షాలు తోడు..
- కడెం ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో
- స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులకూ..
- గేట్లు ఎత్తివేసిన అధికారులు
- గోదావరి ఉగ్రరూపం



కడెం ప్రాజెక్టు గేట్లు ఓపెన్ చేయడంతో గోదారిలోకి వెళ్తున్న వరదనీరు

నిర్మల్: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు జిల్లాకు వరద పోటెత్తుతోంది. దీనికి జిల్లాలో ఆగకుండా కురుస్తున్న వర్షాలు తోడవడంతోంది. జిల్లా సరిహద్దున గల నాందేడ్ ప్రాంతంలోనూ భారీగా వర్షాలు కురుస్తుండటంతో అక్కడి నుంచి జిల్లా మీదుగా వెళ్లే నదులు, వాగులు ఉప్పొంగుతున్నాయి. జిల్లాలోని ప్రాజెక్టులకు లక్షల క్యూసెక్కుల్లో ఇన్‌ఫ్లో వస్తోంది. కడెం ప్రాజెక్టుకు సోమవారం వేకువజామున మళ్లీ వరద పోటెత్తింది. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో దిగువ మండలాల్లోని లోతట్టులోని గోదావరి నీరు చేరుతోంది. స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులకూ వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. సోన్ మండలం న్యూవెల్మల్ సమీపంలో సరస్వతికెనాల్‌కు గండిపడటంతో నీళ్లన్నీ పంటచేళ్లలోకి చేరాయి.

కొనసాగుతున్న వాన..

జిల్లాలో సోమవారం కూడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పెంబి మండలంలో 145 మి.మీ. లక్ష్మణచాందలో 134.5 మి.మీ. నిర్మల్‌రూరల్‌లో 123.6 మి.మీ. ఖానాపూర్‌లో 122.8 మి.మీ. కడెంలో 121.8 మి.మీ. సోన్‌లో 120.6 మి.మీ. నిర్మల్‌అర్బన్‌లో 118.8 మి.మీల వర్షపాతం నమోదైంది. మిగితా మండలాల్లోనూ 60–90 మి.మీ. వరకు వర్షం కురిసినట్లు వాతావరణ నివేదికలు చెబుతున్నాయి.

ప్రాజెక్టులకు పైనుంచి..

జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలు తోడుగా పైనున్న మహారాష్ట్ర నుంచి భారీగా వరద వస్తోంది. కడెం ప్రాజెక్టులోకి మహారాష్ట్రతోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని నేరేడిగొండ, ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చేవాగులు ఉప్పొంగుతుండటంతో భారీగా వరద వచ్చింది. సోమవారం వేకువజామున ఒక్కసారిగా 2.30 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అప్రమత్తంగా ఉన్న అధికారులు మొత్తం 18 గేట్లను ఎత్తి దిగువకు వదిలారు. స్వర్ణ ప్రాజెక్టుకు దాదాపు 10వేల క్యూసెక్కులు, గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కుల చొప్పున సోమవారం ఉదయం ఇన్‌ఫ్లో వచ్చింది. ఇన్‌ఫ్లోకు తగ్గట్లు గేట్లను ఎత్తి అవుట్‌ఫ్లో కొనసాగించారు. వరద తగ్గడంతో క్రమంగా గేట్ల సంఖ్యను తగ్గించారు. మంగళవారం కూడా భారీ వర్ష సూచన ఉండటంతో ముందుజాగ్రత్తగా ఇన్‌ఫ్లో కన్నా అవుట్‌ఫ్లో ఎక్కువ మొత్తం ఉంచుతున్నారు.

నేడు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన...

జిల్లాలో మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నివేదికలు వెల్లడించాయి. ప్రధానంగా నిర్మల్ ప్రాంతంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడనున్నట్లు పేర్కొన్నాయి. ఈమేరకు రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందటంతో మంగళవారం కూడా విద్యాసంస్థలకు కలెక్టర్ అభిలాష అభినవ్ సెలవు ప్రకటించారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కడెం ప్రాజెక్టు సందర్శన



ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న శ్రీధర్‌బాబు

కడెం: భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కడెం ప్రాజెక్టును సోమవారం సాయంత్రం పరిశీలించారు. ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతు.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మండలాలలో అధిక వర్షపాతం నమోదయినందున నది పరీవాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ మంత్రికి తెలిపారు. చెరువులు వాగుల సమీపంలోకి ప్రజలు వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్డీవో భుజంగరావు, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సోమవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ సూచనల మేరకు అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చొరవతో రూ.10 కోట్లు వెచ్చించి కడెం ప్రాజెక్టును పునరుద్ధరించామన్నారు. ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు కాక ముందు 8 నుంచి 9 గ్రామాల ప్రజలు భయభ్రాంతులతో గడిపేవారన్నారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించాలని పేర్కొన్నారు. అనంతరం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. వరదల కారణంగా వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉన్నందున వర్షాలు ముగియగానే చేపట్టాల్సిన ప్రణాళిక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, అడిషనల్ కలెక్టర్లు, ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, డీఎస్పీ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

‘కడెం’ పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల
- ప్రాజెక్టును సందర్శించిన జిల్లా అధికారులు
- లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం

కడెం: భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి కడెం ప్రాజెక్టును వారు సందర్శించారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వరద నీటిని 10 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నట్లు అధికారులను కలెక్టర్, ఎస్పీకి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. నిరంతరం నీటి ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి, ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు, చేపలు వేటకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టు వద్ద పోలీసులు పటిష్ట భద్రతను కొనసాగించాలని తెలిపారు. పర్యాటకులు ప్రాజెక్టు సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ ఇంటి నుంచి బయటకు రావొద్దన్నారు. వర్షాలతో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వారివెంట ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్పీ గంగారెడ్డి, ప్రాజెక్టు ఈఈ విఠల్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వరద బీభత్సం..



స్వర్ణ ప్రాజెక్టు నుంచి దిగువకు వరద..

సారంగపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వరదలు పోటెత్తాయి. మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడు వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు(1.484 టీఎంసీలు) కాగా 20,180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు అంతే మొత్తం నీటిని దిగువకు విడుదల చేశారు. నిర్మల్-స్వర్ణ ప్రధాన రహదారిపై సాయినగర్-ధని, చించోలి(బి)-నిర్మల్, రాంసింగ్ తండా సమీపంలో పాట్యా, తాండ్ర(జి) వైకుంఠాపూర్ గ్రామాల మధ్యలోని లోలెవెల్ వంతెనలపై వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండలంలోని ధని–సాయినగర్ గ్రామాల మధ్యలో పెద్దపెద్ద వృక్షాలు లోలెవెల్ వంతెనకు అడ్డు పడడంతో ఎస్సై శ్రీకాంత్ జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. జామ్ గ్రామంలో పిడుగు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తన సిబ్బందితో కలిసి మరమ్మతుల చేపట్టిన సరఫరాను పునరుద్ధరించారు.



నిర్మల్ పట్టణంలో రోడ్డుపై వరద..



సారంగాపూర్: లోలెవెల్ వంతెనపై చెత్త తొలగింపు



నిర్మల్ పట్టణంలో ప్రధాన రహదారిపై వరద..



రోడ్డుపై నీటిని తొలగింపజేస్తున్న చైర్మన్

నేడు విద్యాసంస్థలకు సెలవు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో మంగళవారం కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సెలవు పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఇబ్బందికలగకూడదనే సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎంపీడీవోలుగా పదోన్నతి

నిర్మల్‌చైన్‌గేట్: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనిత రామచంద్రన్ జిల్లాలోని పలు మండలాలకు ఎంపీడీవోలను కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.అశోక్‌కుమార్ బాసర, పి.సుధాకర్ రెడ్డి భైంసా, ఎస్.నవనీత్ కుబీర్, టి.లింబాద్రిని కుంటాల, ఎ.వెంకటరమేష్ లోకేశ్వరం, శివకుమార్ ముధోల్ ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆందోళన చెందొద్దు

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: అధిక వర్షాల నేపథ్యంలో శివారు కాలనీల ఉన్న ప్రజలు ఆందోళన చెందొద్దని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన సోన్ మండలం జఫ్రాపూర్‌తోపాటు నిర్మల్ పట్టణంలోని ముంపు ప్రాంతమైన జీఎన్‌ఆర్ కాలనీని సోమవారం సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు.

‘సాకెర’ ఎత్తు తగ్గింపునకు నిధులు

నిర్మల్‌చైన్‌గేట్: సోన్ మండలం సాకెర గ్రామంలో నిర్మించిన చెక్ డ్యాం ఎత్తు తగ్గించేందుకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో కురిసిన వర్షాలకు నీట మునిగిన జీఎన్‌ఆర్ కాలనీని బీజేపీ నాయకులు సోమవారం సందర్శించారు అనంతరం వారికోసం అల్‌ఫోర్స్ స్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస సెంటర్‌లో కాలనీవాసులను కలిసి మాట్లాడారు.

శివారు కాలనీలు జలమయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మల్ పట్టణ శివారు కాలనీలు జలమయమయ్యాయి. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయా కాలనీల్లో సోమవారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిద్దాపురం వాగును పరిశీలించారు. స్థానిక అల్‌ఫోర్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు

నిర్మల్‌టౌన్: భారీ వర్షం కారణంగా నిర్మల్ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని పలు కాలనీలలో సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. జాతీయ రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనాలను దారిమళ్లించారు. రోడ్డుపై నీటిని డ్రెయినేజీల్లోకి మళ్లించారు. చైర్మన్ వెంట పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.




శివారు కాలనీలను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, శ్రీహరిరావు తదితరులు

దారితప్పిన గురువులు

- ‘కాయిన్స్’కోసం కక్కుర్తిపడి..
- భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైనా..
- అత్యాశతో యూబిట్ దందా..
- రూ.లక్షలు వస్తుండటంతో విధుల్లో నిర్లక్ష్యం
- చివరకు కటకటాలపాలు..



యూబిట్ గురించి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీషర్మిల, పక్కన ఏఎస్పీ అవినాష్‌కుమార్



నిర్మల్: బడిని గుడిగా మార్చి, నాలుగుగోడల మధ్య పిల్లల జీవితాలను తీర్చిదిద్దుతున్న గురుదేవుళ్లెందరో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రత్యేకశ్రద్ధ పెట్టి పాఠాలు చెబుతున్న వాళ్లూ ఉన్నారు. ఇప్పటికీ సమయానికి బడికి వెళ్తూ.. తమ విధులకు న్యాయం చేస్తూ.. తమ విద్యార్థులు సాధించే చిన్నచిన్న విజయాలకే పొంగిపోతున్నారు. ఎన్ని సమస్యలున్నా.. కేవలం తమను నమ్ముకుని సర్కారు బడులకు వస్తున్న విద్యార్థుల ఆశలను నిలబెడుతున్నారు. కానీ.. కొంతమంది గురువులు మాత్రం దారితప్పుతున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం వస్తున్న వేళ.. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ‘కాయిన్స్’ వేటలో, కాసుల కక్కుర్తిలో పడి తమ వృత్తికే మచ్చ తెచ్చారు. చివరకు కటకటాలపాలయ్యారు. పాఠాలు చెప్పడం మరిచి.. బడికి రాకుండానే గడిపేస్తున్నారు. డబ్బు ఆశతో ఆన్‌లైన్ దందాలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు, ఇతరత్రా బిజినెస్‌లు చేస్తూ.. విధులకు ఎగనామం పెడుతున్నారు. బయోమెట్రిక్, లైవ్‌లొకేషన్‌లను వీళ్లకోసం పెట్టాల్సి వస్తోందంటేనే సిగ్గుచేటు. అలాంటివి పెట్టినా కొంతమంది సార్లు తప్పించుకుంటున్న తీరు మరీ దారుణం. తరగతి గదిలో ఎదురుగా ఉన్న విద్యార్థులను పట్టించుకోకుండా.. ఎక్కడో ఉన్నవాళ్లతో సెల్‌ఫోన్‌లో బిజినెస్ సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. జిల్లాలో బయటపడ్డ యూబిట్ దందాలో దాదాపు 70 శాతం ప్రభుత్వ ఉపాధ్యాయులే ఉండటం గమనార్హం.

మా‘స్టార్లు’ ఇలాగేనా..!?

ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల సందర్భంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ‘మా సార్ మాకే కావాలి..’ అంటూ అడ్డుకున్నారు. కొన్ని గ్రామాల్లో రాస్తారోకోలు చేసిన సందర్భాలూ చూశాం. కొందరు తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లు వెళ్లిపోతుంటే కన్నీరుమున్నీరయ్యారు. ఇంకొందరు సార్ పనిచేసే బడికే పోతానంటూ దూరభారమైనా అదే స్కూల్‌కు వెళ్తున్నారు. ఇలా.. విద్యార్థుల మనసుల్లో నిలిచి ‘మా మంచి మా‘స్టార్లు’ అనిపించుకున్నారు. కానీ.. జిల్లాలో చాలామంది అలా కాకుండా వేరే విధంగా ‘స్టార్లు’ అవుతున్నారు. యూబిట్ ఊబిలోకి తాము దిగడమే కాకుండా వందలమందిని లాగుతూ త్రీస్టార్, ఫైవ్‌స్టార్ గ్రేడ్‌లను సాధించి గొప్పగా ఫీలయ్యారు. ఎంత దారుణమంటే.. ఈ దందాను ముందుకు తీసుకెళ్లడానికి ‘అరె.. నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. నేనే ఇందులో డబ్బులు పెట్టిన. నమ్మండి.. మీరు కూడా చేరండి..’ అని చెప్పుకోవడం సిగ్గుచేటు. తాము చదివిన చదువుకు, కష్టపడి సాధించిన కొలువుకు, తమ విధినిర్వహణకు సంబంధం లేకుండా దందాలు చేస్తూ ఉపాధ్యాయులపై ఉన్న గౌరవాన్ని తగ్గిస్తున్నారు.

భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నా..

యూబిట్ దందాలో పోలీసులు ఐదుగురినే అదుపులోకి తీసుకున్నారు. కానీ ఈ రెండురోజులుగా వందలాది పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో కొందరి పేర్లు విని విస్తుపోవాల్సి వస్తోంది. భార్యాభర్త ఇద్దరూ ఉపాధ్యాయులు, ఉద్యోగులుగా ఉన్నా.. ‘కాయిన్స్’ కోసం కక్కుర్తి పడిన తీరు దారుణం. చెరో రూ.లక్ష చొప్పున నెలవారీ వేతనం ఉన్నప్పటికీ అత్యాశపడ్డారు. పోలీసులకు పట్టుకున్నవారిలో అధికారి భార్య స్కూల్‌అసిస్టెంట్. అంతే కాదు. ఆయనకు త్వరలోనే ప్రమోషన్ కూడా ఉండటం గమనార్హం.

అధికారుల తీరుపైనా..

బడిలో ఉండాల్సిన సార్లు విదేశాలకు ట్రిప్పులు కొడుతుంటే.. పాఠాలు చెప్పాల్సిన టీచర్లు ఎక్కడో ఫంక్షన్‌హాళ్లలో, వేరేవాళ్ల ఇళ్లల్లో మీటింగ్‌లు పెట్టి యూబిట్/దందాల గురించి చెబుతుంటే.. పర్యవేక్షించాల్సిన పైఅధికారులు ఏం చేస్తున్నట్లు అన్న ప్రశ్నలూ వస్తున్నాయి. విద్యాశాఖలో దారి తప్పిన ఉపాధ్యాయుల తీరుతోపాటు జిల్లా విద్యాశాఖ కార్యాలయంపైనా విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల కేసులు, అరెస్టుల తర్వాత సదరు టీచర్ల ఇళ్లలోనూ ‘తమకేమవుతుందో..’ అన్న ఆందోళన కనిపిస్తోంది. ‘నేను చెబితే వినలేదు. చూడండి.. ఇప్పుడెంత టెన్షనో..’ అన్న మాటలూ వినిపిస్తున్నాయి.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిర్మల్ రూరల్: జిల్లాలో సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్/క్రిప్టో కరెన్సీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ దందాలో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. బూస సాయికిరణ్, ఎస్జీటీ (ఎంపీపీఎస్, మొర్రిగూడ, కడెం మండలం), కండెల నరేశ్,(ఎస్జీటీ, ఎంపీపీఎస్ గంగాపూర్, కడెం మండలం)ను పోలీసుల రిమాండ్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు క్రిప్టో కరెన్సీ మాయలో పడొద్దని, తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మీరిచ్చే జీతమెంత...!?

‘అరె సార్.. నేను రోజుకు సంపాదించే దానిముందు మీరిచ్చే జీతమెంత..!? ఒక్క రోజులోనే నెల సాలరీ సంపాదిస్తా..’ ఇది యూబిట్ దందాలో ఉన్న ఓ ఉపాధ్యాయుడు తమ పైఅధికారితో మాట్లాడిన తీరు. కడెం మండలానికి చెందిన మరో ఉపాధ్యాయుడు తనకు అనుకూలంగా ఉన్న చోటికి డిప్యూటేషన్ ఇవ్వకపోవడంతో ఏకంగా విధులకే లాంగ్‌లీవ్ పెట్టేందుకు సిద్ధమయ్యాడంటే తను చేస్తున్న దందాలో ఎంతవరకు వెళ్లిపోయాడో అర్థం చేసుకోవచ్చు.

తానూరు మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు కూడా అవసరమైతే విద్యావాలంటీర్లను పెట్టి నడిపిస్తాం.. అనే స్థాయికి చేరారు. ఇలా ఎంతోమంది తమ విధులను మరిచి దందాల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

సంఘాల్లో.. దందాల్లో..

ఒక ఉద్యోగి తప్పుచేస్తే పెద్దగా ప్రభావం ఉండదు. కానీ.. ఓ ఉపాధ్యాయుడు తప్పటడుగు వేస్తే సమాజాన్నే తప్పుదోవ పట్టించిన వాడవుతాడు. జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు తమ వృత్తిధర్మాన్ని ఎప్పుడో మర్చిపోయారు. సంఘాల పేరు చెప్పి కొంతమంది చేస్తున్న రాజకీయాలు, సెటిల్‌మెంట్లపై బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ఒక్క యూబిట్ దందాలోనే కాదు.. రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్‌లు మొదలు ఇంకా ఎన్నో వ్యాపారాల్లో చాలామంది టీచర్లే భాగస్వాములుగా ఉంటున్నారు. ఇలా చేయడం తప్పని కాదు, కానీ.. ఇదే తమ అసలు పని అన్నట్లుగా ఉపాధ్యాయ విధులను గాలికి వదిలేస్తున్న తీరే సమాజంలో టీచర్లపై ఆరోపణలకు తావిస్తోంది.

క్లుప్తంగా

కృష్ణ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణ ఎక్స్‌ప్రెస్ (17206) సర్వీసు రద్దు చేస్తున్నట్లు ద.మ రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళవారం ఈ సర్వీసు రద్దు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

పలు రూట్లలో బస్సులు నిలిపివేత

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సోమవారం తాత్కాలికంగా రద్దయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఒంగోలు, గుంటూరు వెళ్లే సర్వీసును ఖమ్మం వరకు మాత్రమే నడుపుతున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల-జగిత్యాల మధ్య నడిచే 5 సర్వీసులు, భైంసా పరిధిలో ఓలా, నిగ్వా వంటి రూట్లలో తాత్కాలికంగా బస్సులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల మయూర్ సుభాష్ ఇంట్లో టీచర్ కుటుంబం అద్దెకు ఉంటోంది. ఈనెల 1న ఆ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియబాద్‌కు చెందిన షాదాబ్‌తోపాటు మరో ఇద్దరు సోను, దిలీప్‌లు ఇంటి తాళం పగలగొట్టి చొరబడ్డారు. గమనించిన ఇంటి యజమాని రావడంతో వారు పరారయ్యారు. యజమాని ఫిర్యాదుతో సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. రైల్వేస్టేషన్‌లో అనుమానం వచ్చి షాదాబ్‌ను విచారించగా చోరీకి యత్నించినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితులు పట్టణంలోని కృష్ణా లాడ్జిలో అరుణ్ అనే నకిలీ ఆధార్ కార్డుతో రూమ్ అద్దెకు తీసుకున్నట్లు వివరించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదివారం పట్టుబడ్డ నిందితుడు షేక్ కలీమ్‌ను రిమాండ్‌కు తరలించగా, సోమవారం మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన హనుమాన్ ధర్మాజీను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈయన ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డు సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 52 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి మేకల నిర్విజ్ఞపై సోమవారం కుక్కలు దాడి చేశాయి. మధ్యాహ్న సమయంలో ఇంటి ఆవరణలో పువ్వులు తెంపడానికి వెళ్లిన చిన్నారి వద్దకు నాలుగు కుక్కలు ఎదురుగా వచ్చాయి. ఒక కుక్క దాడిలో గాయపడిన చిన్నారి కేకలు వేసింది. వెంటనే పరిగెత్తుకుని వచ్చిన కుటుంబీకులు ఆమెను కాపాడారు. అప్పటికే చిన్నారికి పలుచోట్ల గాయమైంది. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా, కాలనీకి చెందిన ఓ వ్యక్తి 14 కుక్కలు పెంచుతున్నాడని తెలిపారు. వీధికుక్కల విషయంలో మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఎందుకు బిడ్డా.. ఇంతపని చేసుకున్నరు..!



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన..
- తల్లిదండ్రుల రోదనలు వర్ణనాతీతం
- కన్నీటి మధ్య ముగిసిన అంత్యక్రియలు
- మృతుల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మంచిర్యాలక్రైం: ''ఎందుకు బిడ్డా ఇంత పని చేసుకున్నరు.. మేమున్నం. ఎన్ని అప్పులున్నా తీర్చుకుందామని చెప్పితిమి కదా.. బిడ్డా పిల్లలు ఏం పాపం చేశారు. ఎందుకిలా చేశావు..'' అంటూ ఆ తల్లి రోదించిన రాజేశ్వరి తీరు కాలనీ వాసులను కంటతడి పెట్టించింది. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఇప్ప కొమురయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడు వెంకటేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పుల పాలు కావడం,



వెంకటేష్ తల్లి రాజేశ్వరిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

వెంకటేష్ శనివారం రాత్రి తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమించి తానూ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. వెంకటేష్, అతడి భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్(11), విహాంత్(3) మృతదేహాలు సోమవారం ఉదయం మంచిర్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి ఎదుట నలుగురి మృతదేహాలను వరుసగా ఉంచిన తీరుతో స్థానికులు కంటతడి పెట్టారు. చివరి చూపు కోసం బంధువులు, కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాలనీ మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. ''గణేష్ పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన బిడ్డా..'' అంటూ వర్షిణి తల్లి పద్మ రోదించిన తీరు అక్కడున్నవారిని ఆవేదనకు గురి చేసింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ సంజీవ్. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలకు ఆటంకం

మంచిర్యాల పట్టణంలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు గోదావరి నదీ తీరంలోనే నిర్వహిస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అంత్యక్రియలకు స్థలం లేకుండా పోయింది. దీంతో అండాలమ్మ కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో సత్తా



పోటీల్లో సత్తా చాటిన శిశుమందిర్ విద్యార్థులు

ముథోల్: ముథోల్ శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటారని ప్రధానాచార్యులు సారథిరాజు తెలిపారు. మంచిర్యాల జిల్లా చౌక్కా రాంపూర్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్న పదోతరగతి విద్యార్థిని ఆర్.ప్రత్యూష అండర్ 17లో ట్రిపుల్ జంప్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకుంది. వంద మీటర్ల పరుగుల పందెంలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. పాఠశాలకు చెందిన బి.వీణ అండర్ 14 హార్డిల్స్‌లో తృతీయ స్థానం, ఎస్.సారిక అండర్-14 హైజంప్‌లో తృతీయ స్థానం సాధించారు.



గోల్డ్, సిల్వర్ మెడల్‌లతో విద్యార్థులు

కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూలో ప్రతిభ

ఖానాపూర్: ఓపెన్ నేషనల్ కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లో ఆదివారం జరిగాయి. పోటీల్లో ఖానాపూర్, కడెం మండలాల విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ మనోహర్ తెలిపారు. బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నాగచైతన్య, ప్రవళిక, వాసు విద్యాలయానికి చెందిన అక్షర్, సాయితేజ, బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన యక్షిగ గోల్డ్‌మెడల్స్ సాధించారు. లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శ్రీజ, మేఘన, బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన రితీశ్‌యాదవ్, శాంతినికేతన్ పాఠశాలకు చెందిన చరణ్‌తేజ్ సిల్వర్‌మెడల్స్ సాధించారు.

కళాకారుడికి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న డా.వేణుగోపాలకృష్ణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన లఘు చిత్రాల కళాకారుడు, వైద్యుడు డా.వేణుగోపాలకృష్ణకు ఉత్తమ నటుడు పురస్కారం లభించి ంది. హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్స్‌లో 24 ఫ్రేమ్స్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వేణుగో పాలకృష్ణకు ప్రముఖ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ జ్ఞాపికను అందజేశారు. వేణుగోపాలకృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన 'ప్రేమతో నాన్న..' లఘుచిత్రానికిగానూ గతంలోనే ప్రశంసలు, పురస్కారాలు దక్కాయి. తాజాగా ఉత్తమ పురస్కారం పొందటంపై జిల్లాకు చెందిన టీవీ, చలనచిత్ర, లఘుచిత్రాల కళాకారులు ఆయనను అభినందించారు.

వ్యవసాయ వర్సిటీ ఆవిర్భావ వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం పదో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో గల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్ మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆచార్య ఎన్జీ రంగ యూనివర్సిటీ నుంచి విడిపోయిందని పేర్కొన్నారు. వర్సిటీ ప్రధాన భాగాలైన బోధన, పరిశోధన, విస్తరణ అంశాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి రాంప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, బోధన సిబ్బంది రాజేశ్వర్, భానురేఖ, అనిత, సురేష్, సునీల్ కుమార్, రాకేష్, సింధు, మౌనిక, అపూర్వ, సాయికిరణ్, ప్రీతంరెడ్డి, శ్రీకాంత్, గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న కళాశాల డీన్ శ్రీధర్ చౌహాన్

గోపికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న గోపి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, నటుడు, సామాజికవేత్త గోపిని శ్రీనివాస మెమోరియల్ అవార్డు వరించింది. నిజామాబాద్‌లోని సంగీత్ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవంతో భాగంగా వివిధ రంగాలలో చేస్తున్న సేవలకు గానూ గోపికి అవార్డు ప్రదానం చేశారు. సినీ రచయిత కాసర్ల శ్యామ్, నిజామాబాద్ కమిషనర్ మకరంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నా రు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ 1, తెలుగు 2, హిందీ 1, హిస్టరీ 1, ఎకనామిక్స్ 2, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 2, గణితం 2, భౌతికశాస్త్రం 3, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ 1, జువాలజీ 1 సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పీజీలో 55 శాతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. తమ ధ్రువపత్రాలతో ఈనెల 4న కళాశాలలో దరఖాస్తులు అందించాలని, 6న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్‌టౌన్: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదీ, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పుచెప్పారు. కోర్టు సమన్వయల అధికారి డల్లుసింగ్ కథనం ప్రకారం..కుంటాల మండలం రాజాపూర్ తండాకు చెందిన చావాన్ సుధాకర్ ఏ పని చేయకుండా తిరుగుతుండేవాడు. ఫిబ్రవరి 16, 2020న అదే గ్రామానికి చెందిన జాదవ్ సంజయ్, సుధాకర్‌కు బియ్యం బస్తా విషయంపై గొడవ జరిగింది. అదేరోజు సుధాకర్ సంజయ్ ఇంటికి వెళ్లి కుటుంబీకులను దుర్భాషలాడి కొట్టాడు. దీంతో పెద్దమనుషులు వచ్చి సర్దిచెప్పారు. ఈ విషయాన్ని సుధాకర్ మనసులో పెట్టుకుని సంజయ్ కుమారుడు ఇతిష్‌ను మరుసటి రోజు చేనులోకి తీసుకెళ్లి బండరాయితో కొట్టి చంపాడు. సంజయ్ ఫిర్యాదుతో అప్పటి సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరుపర్చారు. పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 13 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు.

పెంపుడు కుక్కను ముస్తాబు చేసి..ఊరేగింపు



తాంసి: సాధారణంగా పొలాల అమావాస్య అంటే రైతులు ఎద్దులను ముస్తాబు చేసి ఊరేగిస్తారు. అయితే ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రైతు బక్కి అశోక్ తన పెంపుడు కుక్కను సైతం ఇలా అలంకరించి బసవన్నలతో కలిపి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



కదం భోజరాం (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన యువకుడు కదం భోజరాం(28) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కథనం ప్రకారం.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భోజరాం ఆదివారం రాత్రి ఇంటిపై రేకులు సరిచేస్తున్నాడు. ఈక్రమంలో రేకులకు తెగిన విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై కింద పడి మృతిచెందాడు. తల్లి అన్నబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి మరొకరు..

నర్సాపూర్(జి): ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన రామనోల్ల వెంకటేశ్ (24) ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. తండ్రి గంగాధర్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. కుస్లి శివారులోని గంగాధర్‌కు చెందిన వ్యవసాయ పొలంలో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతకగా బావిలో మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సంకల్పమే ఆయుధమైతే విజయం



సంకల్పం గట్టిదైతే మనిషి ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చని.. ఏ పనైనా అలవోకగా చేయవచ్చని నిరూపిస్తున్నారు ఆదిలాబాద్ పట్టణం కోలిపురకు చెందిన విజయ్‌కుమార్. ప్రస్తుతం చిన్నపాటి సమస్యలకే కుంగిపోతున్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వినాయక విగ్రహాల తయారీలో మంచి గుర్తింపు సాధించాడు. నాలుగేళ్ల క్రితం విగ్రహాల తయారీ సమయంలో గ్యాస్‌పేలి ప్రమాదం సంభవించింది. దీంతో చేయి కోల్పోయాడు. అయినప్పటికీ సంకల్పాన్ని మాత్రం వీడలేదు. విధి వంచించినా... పట్టు వదలని విక్రమార్కుడిలా మూడేళ్ల నుంచి పర్యావరణ హిత మట్టి విగ్రహాలు తయారు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఇరవై ఫీట్లకు పైగా ఉన్న భారీ వినాయకులను ఒంటి చేత్తో రూపొందిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలోని ఉమ్మెడ ఉమామహేశ్వరుని ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతికి సోమవారం ఆలయం నీట మునిగింది. ఎస్సారెస్పీలో బ్యాక్‌వాటర్ నీరు చేరడంతో ఆలయం పూర్తిగా నీట మునిగి కనిపిస్తోంది.



నాడు..



నేడు

అధికారులూ.. ఇదేం తీరు!



వంజర్‌లో మహిళ, పిల్లలతో అధికారులు

సారంగపూర్: నిరాశ్రయులకు అండగా ఉండాల్సిన జిల్లా బాలల పరిరక్షణ అధికారులు..వారు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తిరుమలచారికి గత నెల 28న మతిస్థిమితం లేని మహిళ ఇద్దరు చిన్న పిల్లలతో భిక్షాటన చేస్తూ కనిపించింది. ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసి కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ట్యాగ్ చేశాడు. స్పందించిన కలెక్టర్.. వారికి రక్షణ కల్పించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారులను ఆదేశించింది. వెంటనే వారు ఇక్కడికి వచ్చి తీసుకెళ్లారు. బాలిక(7)ను స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. కాగా సదరు మహిళ కొట్ల(బి)లో, వంజర్‌లో భిక్షాటన చేస్తూ పలువురి కంటపడింది. దీంతో ప్రజలు..తిరుమలాచారికి సమాచారం అందించారు. ఈయన ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం చేరవేశారు. సోమవారం సదరు మహిళను, ఇద్దరు పిల్లలను బాలల పరిరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ విషయమై బాలల పరిరక్షణ అధికారి మురళిని వివరణ కోరగా పిల్లలతో ఇక్కడ ఉండలేనని మహిళ గొడవ చేసి వెళ్లింది. ఆమెకోసం గాలించగా సమాచారం తెలియడంతో మళ్లీ తీసుకెళ్లామని బదులిచ్చారు.

దేశ రక్షణకు నడుం బిగించాలి



ఎన్‌సీసీ కేడేట్లతో సైనికాధికారులు, సైనికులు

- మేజర్ అభిజిత్ సింగ్
- ఆదిలాబాద్‌కు చేరిన టెరిటోరియల్ ఆర్మీ సైకిల్ ర్యాలీ

ఆదిలాబాద్: టెరిటోరియల్ ఆర్మీలో భాగస్వామ్యులై యువత దేశ రక్షణకు నడుంబిగించాలని మేజర్ అభిజిత్ సింగ్ అన్నారు. టెరిటోరియల్ ఆర్మీ (టీఏ) స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రం సియాచిన్ గ్లేసియర్ నుంచి భారత దక్షిణ సరిహద్దు ఇందిరా పాయింట్ వరకు టీఏ సైనికులు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకోగా, ఎన్సీసీ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిజిత్ సింగ్ మాట్లాడుతూ టీఏ అవశ్యకతను తెలియజేయాలనే ఉద్దేశంతో 5,500 కి.మీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సైకిల్ యాత్ర జూలై 30న ప్రారంభమైందన్నారు. సైనికుల అధికారి సావంత్, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు పాల్గొన్నారు.

కిరాణాషాపులో చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: కిరాణా షాపులో చోరీకి పాల్పడిన మరో నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు రోజుల కిందట చోరీ జరిగింది. ఆదివారం ఓ నిందితుడిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన అర్షద్‌ను సోమవారం పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



భూమేశ్ మృతదేహం

బోథ్: జీవితంపై విరక్తితో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని రాసిమెట్ల గ్రామానికి చెంది న ఎర్రం భూమేశ్ కుటుంబం గతకొంత కాలంగా బోథ్ మండల కేంద్రంలోని న్యూకాలనీలో స్థిరపడింది. గత నాలుగేళ్లక్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో తమ్ముడు రమేశ్‌తోపాటు కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనంలోని గదికి వెళ్లగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. తమ్ముడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని భర్త..

తాంసి: భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని ప్రచారం జరగడంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శివరాం కథనం ప్రకారం..గ్రామానికి చెందిన బొజ్జ రవీందర్(32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ప్రచారంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి రాంబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.